సాక్షి గుంటూరు

ఆదివారం । 16 । జూలై । 2023



కాంట్రాక్ట్ క్యారేజీ బస్సులు సీజ్

పట్నంబజారు: గుంటూరు జిల్లాలో శనివారం రవాణా శాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి. నిబంధనలు పాటించని కాంట్రాక్ట్ క్యారేజీ బస్సులపై 20 కేసులు నమోదు చేశారు.



సంరక్షణ కేంద్రానికి బాలలు

నెహ్రూనగర్: గుంటూరు రైల్వే స్టేషన్‌లో 10 నుంచి 17 సంవత్సరాల్లోపు వయస్సు ఉన్న 19 మంది బాలలను గుర్తించి సంరక్షణ కేంద్రానికి పంపించినట్లు ఐసీడీఎస్ పీడీ మనోరంజని తెలిపారు.



తిరుపతమ్మ ఆలయానికి విరాళం

పెనుగంచిప్రోలు: స్థానిక తిరుపతమ్మ ఆలయానికి శనివారం తెనాలికి చెందిన సూర్యదేవర బాలకృష్ణ, స్వరూపరాణి దంపతులు రూ.1,01,116 విరాళం అందజేశారు.

న్యూస్‌రీల్

21న జిల్లా అథ్లెటిక్ పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో ఈ నెల 21న స్థానిక బీఆర్ స్టేడియంలో ఉదయం 9 గంటలకు అండర్‌- 10, 12, 14, 16 బాలబాలికల అథ్లెటిక్ పోటీలు నిర్వహిస్తామని జిల్లా కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 100, 300, 600, 800 మీటర్ల పరుగు, షాట్‌పుట్, లాంగ్‌జంప్‌లో పోటీలుంటాయన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు ఈ నెల 20లోపు తమ ఎంట్రీలను స్టేడియంలో నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 96666 35296 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

23న స్టేట్ ఓపెన్ టెన్నిస్ పోటీలు...

గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీన అండర్‌- 12, 14, 16 బాలబాలికల టెన్నిస్ పోటీలు నిర్వహిస్తామని పోటీల నిర్వహణ కార్యదర్శి కె.అరుణ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను స్థానిక బీఆర్ స్టేడియంలో నిర్వహిస్తామన్నారు. తమ ఎంట్రీలను ఈ నెల 21 సాయంత్రంలోపు అందజేయాలన్నారు. వివరాలకు 81437 83999 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 518.30 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎడమ కాలువకి 4,547 ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి వచ్చే నీటి చేరిక నిలిచిపోయింది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 809.10 అడుగుల వద్ద ఉంది.

స్టాఫ్‌నర్సులుగా 76 మందికి నియామక ఉత్తర్వులు

గుంటూరు మెడికల్: ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఖాళీగా ఉన్న పలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో స్టాఫ్‌నర్సుల భర్తీకి శనివారం గుంటూరు ప్రాంతీయ వైద్య, ఆరోగ్య శాఖ సంచాలకుల కార్యాలయం (ఆర్డీ) లో కౌన్సెలింగ్ జరిగింది. కౌన్సెలింగ్ ప్రక్రియలో 76 మందికి నూతనంగా స్టాఫ్‌నర్సులుగా ఉద్యోగ నియామక పత్రాలను గుంటూరు ఆర్డీ డాక్టర్ జొన్నలగడ్డ యాస్మిన్ అందజేశారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, సూపరింటెండెంట్ గోపవరపు స్టాన్లి రాజ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ షేక్ నాగూర్ షరీఫ్ పాల్గొన్నారు. నూతనంగా ఉద్యోగాలు పొందిన నర్సింగ్ సిబ్బంది చిత్తశుద్ధితో విధులు నిర్వహించి ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డాక్టర్ యాస్మిన్ సూచించారు.

దాసాంజనేయుని సేవలో హైకోర్టు న్యాయమూర్తి



మధురానగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ నగరంలోని మాచవరం దాసాంజనేయ స్వామి వారిని శనివారం హైకోర్టు న్యాయమూర్తి వెంకట రమణ దర్శించుకొని పూజలు చేశారు. ఆలయ అర్చకులు, కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని, ధర్మకర్తల మండలి చైర్మన్ కనపర్తి కొండ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అర్చకులు సుబ్బయ్య ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి నగరానికి చెందిన భక్తులు వాసిరెడ్డి పార్థసారథి, అనురాధ దంపతులు శనివారం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. నిత్యాన్నదాన సేవలో ఈ విరాళాన్ని వినియోగించాలని దుర్గగుడి అధికారులను కోరారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందచేశారు.


పుస్తకం.. సరఫరా వినూత్నం

సెమిస్టర్ -2 పుస్తకాలొచ్చేశాయ్..

- ప్రయోగాత్మకంగా 90 పాఠశాలలకు అమెజాన్ ద్వారా నేరుగా సరఫరా
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎండీయూ వాహనాలతో పంపిణీకి ఏర్పాట్లు
- గుంటూరు జిల్లా గోడౌన్ నుంచి మండలాలకు చేరుతున్న పుస్తకాలు
- విద్యార్థులకు నిర్దేశిత సమయానికే పుస్తకాలు పంపిణీ



పుస్తకాలను అమెజాన్ ద్వారా పాఠశాలలకు పంపేందుకు ప్యాక్ చేస్తున్న సిబ్బంది



సెమిస్టర్-2 పాఠ్య పుస్తకాలు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సెమిస్టర్-2 పాఠ్య పుస్తకాల పంపిణీ వేగవంతమైంది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అవసరమైన పుస్తకాలను గుంటూరులోని ప్రభుత్వ పాఠ్య పుస్తక గోదాము నుంచి మండల కేంద్రాలకు పంపిణీ చేస్తున్నారు. సెమిస్టర్-2 పుస్తకాలను అమెజాన్ ద్వారా పార్శిల్స్ రూపంలో ప్రయోగాత్మకంగా పంపేందుకు ఏర్పాట్లు చేసిన ప్రభుత్వం ఉమ్మడి గుంటూరు జిల్లాలో 90 పాఠశాలలను ఎంపిక చేసింది. ఈ మేరకు గుంటూరు అమరావతిరోడ్డులోని గోడౌన్ నుంచి ఎంపిక చేసిన పాఠశాలలకు శనివారం అమెజాన్ ద్వారా పుస్తకాలను పంపించారు. అదేవిధంగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పాఠశాలలకు అవసరమైన సెమిస్టర్-2 పాఠ్య పుస్తకాలను పౌర సరఫరాలశాఖ ఆధ్వర్యంలోని ఎండీయూ వాహనాల ద్వారా పాఠశాలలకు నేరుగా పంపిణీ చేయనున్నారు. మండల పరిధిలోని పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన పుస్తకాలను ముందుగా మండల కేంద్రాలకు పంపి, అక్కడి నుంచి పాఠశాలలకు చేరవేయనున్నారు.

22న విద్యార్థులందరికీ ఒకేసారి..

మండలానికి అవసరమైన వాహనాల సంఖ్యను రెవెన్యూశాఖ నుంచి ఎంఈఓలకు వివరాలను అందజేశారు. సంబంధిత ఎంఈఓలు తహసీల్దార్‌ను సంప్రదించి, తమ మండలానికి అవసరమైన వాహనాలను సిద్ధం చేసుకోవాల్సి ఉంది. మండల పరిధిలోని పాఠశాలలకు రూట్ మ్యాప్ సిద్ధం చేసుకుని, పంపాల్సిన పుస్తకాలను ఎండీయూ వాహనాల ద్వారా సరఫరా చేయాల్సి ఉండగా, పాఠశాలలకు సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలను ఈ నెల 22న విద్యార్థులందరికీ ఒకేసారి పంపిణీ చేయాలని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మండలానికి వచ్చిన సెమిస్టర్-2 పుస్తకాలను పాఠశాలలకు పంపేందుకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయడంలో ఎంఈఓలు, పాఠశాలలకు వచ్చిన పుస్తకాలను నిర్దేశించిన రోజున విద్యార్థులకు పంపిణీ చేయడంలో ప్రధానోపాధ్యాయులు తగు చర్యలు చేపట్టాలని డీఈఓ పి.శైలజ ఆదేశించారు.

ఉమ్మడి జిల్లాకు 9,49,412 పాఠ్య పుస్తకాలు..

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన 9,49,412 సెమిస్టర్-2 పాఠ్య పుస్తకాలకు ప్రభుత్వానికి పంపిన ఇండెంట్‌లో శనివారం నాటికి 9,37,429 పుస్తకాలు వచ్చాయి. వీటిలో 7,00,315 పుస్తకాలను మొత్తం 57 మండలాలకు గాను 45 మండలాలకు పంపించారు. సోమవారం నాటికి అన్ని మండలాలకు సరఫరా పూర్తి కానున్నట్లు పాఠ్య పుస్తక విభాగ జిల్లా మేనేజర్ వి.వజ్రబాబు చెప్పారు.

నైపుణ్యాభివృద్ధి మస్తు

విద్యార్థి భవితవ్యానికి జీవన నైపుణ్యాలు తోడు

- నవీన విద్యావిధానంలో అమలుకు శ్రీకారం
- ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు
- తొలిదశ రాష్ట్రంలోని 26 జిల్లాల్లోని 1300 పాఠశాలల్లో అమలు
- మూడేళ్లలో 13 లక్షల మంది విద్యార్థులకు నైపుణ్యాల మెరుగు
- ఇప్పటికే రాష్ట్రస్థాయి శిక్షణ పూర్తి, తాజాగా జిల్లాల్లో శిక్షణ ప్రారంభం



లైఫ్‌స్కిల్స్‌పై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌లో పాల్గొన్న పీడీ, పీఈటీ, యాక్టివ్ టీచర్లు

యడ్లపాడు: సమస్య ఏదైనా ఎంతటి విషమ పరిస్థితి ఎదురైనా స్థిరంగా ఆలోచించి, సొంతంగా ఓ మంచి నిర్ణయాన్ని తీసుకుని ధైర్యంగా వాటిని ఎదుర్కొనే సామర్థ్యం ప్రతి ఒక్కరిలో ఉండాలి. అలాంటి జీవననైపుణ్యాలను ప్రాథమిక దశ నుంచే విద్యార్థులు నేర్చుకుంటే వారు సామాజిక బాధ్యత నెరిగి సంఘంలో ఉత్తమ పౌరులుగా ఉన్నత స్థాయికి ఎదుగుతారు. ఈ ఆలోచనతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవీన విద్యావిధానంలో జీవన నైపుణ్యాల శిక్షణను పాఠ్యాంశాలుగా చేర్చాలని ఓ చారిత్రక నిర్ణయం తీసుకున్నారు. పాఠశాల విద్యశాఖ ఆధ్వర్యంలో ఈ విద్యాసంవత్సరం నుంచే దీనిని అమలు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ 'మ్యాజిక్ బస్ ఫౌండేషన్'తో ఒప్పందం చేసుకుంది. పేదరిక కుటుంబాలకు చెందిన పిల్లలు అత్యధికంగా ఉండే ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మూడేళ్ల కాలం జీవన నైపుణ్యాలు, జీవనోపాధులపై తర్ఫీదు ఇవ్వనుంది.

రాష్ట్రంలో శిక్షణ ఇలా..

రాష్ట్రంలోని 26 జిల్లాలోని ఒక్కొక్క జిల్లాలో 300 మంది విద్యార్థులున్న 50 ఉన్నత పాఠశాలలను జీవన నైపుణ్యాల శిక్షణకు ఎంపిక చేసింది. ఆయా పాఠశాలల్లోని పీడీ/పీఈటీతో పాటు ఒక యాక్టివ్ టీచర్‌కు మూడు రోజుల శిక్షణ ఇస్తారు. శిక్షణపొందిన ఉపాధ్యాయులు తమ పాఠశాలల్లోని 6,7,8 తరగతుల విద్యార్థులకు నేర్పిస్తారు. పాఠశాల టైంటేబుల్‌లో ఏడాదిలో 28 పిరియడ్ల చొప్పున జీవన నైపుణ్యాల శిక్షణ తరగతులకు కేటాయిస్తారు. ఈ శిక్షణలో ప్రధానంగా జ్ఞానాత్మకం, భావాత్మకం, సాంఘిక విషయాలు వంటి 11 రకాల జీవన నైపుణ్యాలపై సమగ్ర అవగాహన కల్పిస్తారు.

తొలివిడతగా..

ఉమ్మడి గుంటూరులో జిల్లా ప్రభుత్వ డైట్ కళాశాలలో తొలిగా గుంటూరు జిల్లాలో ఎంపికైన 50 పాఠశాలల వ్యాయామోపాధ్యాయులకు శిక్షణ ప్రారంభించారు. ఎస్‌సీఈఆర్టీ సౌజన్యంతో మ్యాజిక్ బస్ జాతీయ, రాష్ట్ర ప్రతినిధులు, డైట్ కళాశాల అధ్యాపకులు ఒక్కో జిల్లాకు మూడు రోజుల చొప్పున ఈ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. మొదటిసారిగా శిక్షణ ముగిసిన సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు, శిక్షణ పొందిన వారి అభిప్రాయాలను 'సాక్షి' సేకరించింది.

2 లక్షల మందికి శిక్షణ ఇచ్చాం



1999లో ఢిల్లీలో స్థాపితమైన మా ఫౌండేషన్ ద్వారా పలు రాష్ట్రాల్లో ఇప్పటికే 2 లక్షల మంది విద్యార్థులకు జీవన నైపుణ్యాలు, ఒకేషనల్ కోర్సులపై శిక్షణ ఇచ్చాం. రాష్ట్ర ప్రభుత్వం పేదల జీవన ప్రమాణాలను పెంచాలనే ఉద్దేశంతో వారి పిల్లలకు ప్రాథమిక విద్య నుంచే వీటిపై శిక్షణ ఇవ్వాలని కోరింది. జాతీయ నవీన విద్యా విధానం ద్వారా భవిష్యత్తులో దీనిని కరిక్యులంగా చేయనుంది. భూమిపై పుట్టిన ప్రతి మనిషికి కొన్ని జీవన నైపుణ్యాలు అవసరం.

– కె.స్వాతి, మ్యాజిక్ బస్ ఫౌండేషన్ డీజీఎం ట్రైనర్, నోయిడా, కె.లక్ష్మణ్‌దాస్, ఏపీ ప్రాజెక్టు హెడ్

ప్రభుత్వ ముందుచూపునకు హ్యాట్సాఫ్...



మేము మూడురోజులు లైఫ్‌స్కిల్స్‌పై శిక్షణ పొందాం. జీవన నైపుణ్యాలపై లోతుగా, అర్థవంతంగా, సులువుగా అవగాహన కల్పించారు. ఇవన్నీ విద్యార్థి భావి జీవితానికి ఎంతో దోహదపడతాయి. మనసులోని చెడు ఆలోచన్లను తుడిచేసి పాజిటివ్ దృక్పథం వైపు పిల్లల్ని నడిపిస్తాయనే నమ్మకం ఈ శిక్షణలో తెలుసుకున్నాం. ప్రస్తుత కాలంలో ఇలాంటి శిక్షణ పిల్లలకు వారి తల్లిదండ్రులకు ఎంతో అవసరం. ప్రభుత్వ ఆలోచనకు హ్యాట్సాఫ్.

– ఎస్.భారతి, ఫిజికల్ డైరెక్టర్, పీజే ప్రసూనాంబ, డ్రాయింగ్ టీచర్ (కొల్లిపర జెడ్పీ హైస్కూల్)

సీఎం నిర్ణయం అభినందనీయం...



ఒక పిల్లవాడి జీవితం చిన్ననాటి నుంచే ఎలా ఉన్నతంగా తీర్చిదిద్దాలో ఈ జీవన నైపుణ్యాలు మార్గదర్శకాలు అవుతాయి. బోధన రంగంలో 30 ఏళ్ల మా సర్వీసులో ఇంతటి గొప్పనైపుణ్యాలను పెంపొందించే ప్రభుత్వాన్ని చూడలేదు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ గొప్ప నిర్ణయం విద్యార్థుల జీవితాల్లో గొప్ప మలుపులకు కారణమవుతాయి. ఉత్తమ పౌరులను సమాజానికి అందించేందుకు ముఖ్యమంత్రి చేస్తున్న కృషి అభినందనీయం.

– వై.రాజారెడ్డి, పీడీ (పొన్నెకల్లు జెడ్పీహైస్కూల్), పి.పద్మరాజు, సోషల్ టీచర్(పెదపలకలూరు జెడ్పీ)

రైతు బజార్లలో బియ్యం విక్రయాలు

ప్రారంభించిన జాయింట్ కలెక్టర్ రాజకుమారి



వినియోగదారులకు బియ్యం అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ రాజకుమారి

కొరిటెపాడు(గుంటూరు): జిల్లాలో పెరుగుతున్న బియ్యం ధరలను దృష్టిలో ఉంచుకుని తక్కువ ధరలకు బియ్యంను ప్రజలకు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని జిల్లా జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. చుట్టుగుంట రైతు బజారులో బియ్యం కౌంటర్ కేంద్రాన్ని శనివారం ఆమె ప్రారంభించారు. గుంటూరు నగరంలోని చుట్టుగుంట, ఆర్టీసీ బస్టాండ్ రైతు బజార్లతో పాటు తెనాలి, పొన్నూరు, మంగళగిరి రైతు బజార్లలో ప్రత్యేక బియ్యం కౌంటర్లు ఏర్పాటు చేసి వినియోగదారులకు తక్కువ ధరకు బియ్యం విక్రయించేలా చర్యలు చేపట్టామన్నారు. జిల్లా రైస్ మిల్లర్ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. స్టీమ్ రైస్ కిలో రూ.44, బీపీటీ రకం రూ.48 వినియోగదారుల అవసరాన్ని బట్టి ఎన్ని కిలోలైనా ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే 17వ తేదీ నుంచి మినపగుళ్లు కిలో రూ.101, కందిపప్పు కిలో రూ.135 చొప్పున విక్రయించనున్నట్లు తెలిపారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు బి.రాజబాబు, ఎస్టేట్ అధికారులు పి.లావణ్య, ఫణిబాబు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ప్రస్తుతం మార్కెట్లో బియ్యం ధరలు కొంత పెరిగినందున రైతు బజార్లలో ప్రభుత్వం నిర్ధేశించిన ధరలకు విక్రయాలు జరపాలని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. జేసీ శనివారం స్థానిక చుట్టుగుంటలోని రైతు బజార్‌లో ఆకస్మిక తనిఖీ చేశారు.

అత్యాధునిక సర్జరీలతో అద్భుతాలు

- జీజీహెచ్‌లో వరల్డ్ ప్లాస్టిక్ సర్జరీ డే వేడుకలు
- పాల్గొన్న సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్



ప్లాస్టిక్ సర్జరీ వైద్యులను అభినందిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో ప్లాస్టిక్ సర్జరీ వైద్యులు అత్యాధునిక శస్త్రచికిత్సలతో రోడ్డు ప్రమాద బాధితులు, రోగులకు అత్యాధునిక ఆపరేషన్లు చేసి నూతన జీవితాలు ప్రసాదిస్తూ అత్యద్భుతాలు సృష్టిస్తున్నారని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ అన్నారు. వరల్డ్ ప్లాస్టిక్ సర్జరీ డే సందర్భంగా శనివారం ప్లాస్టిక్ సర్జరీ వైద్య విభాగం ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో చెయ్యి, కాలు, ఇతర అవయవాలు దెబ్బతిన్న వాటిని సరిచేయడంలో ప్లాస్టిక్ సర్జరీ విభాగం ఎంతో కీలకమైందన్నారు. ప్రమాదం జరిగిన ఆరు గంటల్లో ఆసుపత్రికి తీసుకొస్తే అవయవాలు సరిచేయడం కుదురుతోందన్నారు. క్యాజువాల్టీలో ప్లాస్టిక్ సర్జరీ విభాగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. శుక్రవారం 11 ఆపరేషన్లు చేసి ఏపీలోనే అరుదైన రికార్డు సృష్టించిన ప్లాస్టిక్ సర్జరీ వైద్య విభాగాధిపతి డాక్టర్ సుమితా శంకర్, ఇతర వైద్యులను డాక్టర్ కిరణ్‌కుమార్ అభినందించారు. ప్లాస్టిక్ సర్జరీ డే సందర్భంగా వార్డులో కేక్ కట్ చేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్లాస్టిక్ సర్జరీ అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ గంగా భవానీ, డాక్టర్ నజ్మ, డాక్టర్ చంద్రలేఖ, డాక్టర్ నిషాంత్ పాల్గొన్నారు.

ప్రముఖ బ్రాండ్ పేరుతో నకిలీ సిగిరెట్లు

విక్రేతలు అరెస్ట్.. రూ. 7లక్షల విలువైన ప్యాకెట్లు స్వాధీనం



తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ ఈశ్వరరావు

చిలకలూరిపేట: ప్రముఖ బ్రాండ్ నేమ్‌లతో నకిలీ సిగిరెట్ ప్యాకెట్లు విక్రయిస్తున్న దుకాణాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఉమ్మడి గుంటూరు జిల్లా ఎస్పీ కె.ఈశ్వరరావు ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి. చిలకలూరిపేట పట్టణంలో హోల్‌సేల్‌గా సిగిరెట్ ప్యాకెట్లు విక్రయించే చలివేంద్రబజారు, మెయిన్ బజారులో ఈ దాడులు కొనసాగాయి. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కె.ఈశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రముఖ బ్రాండ్‌నేమ్‌లతో నకిలీ సిగిరెట్లు విక్రయిస్తున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఐటీసీ కంపెనీకి చెందిన గోల్డ్‌ఫ్లేక్ నకిలీ సిగిరెట్లతో పాటు లైసెన్సులేని అన్‌బ్రాండెడ్ సిగిరెట్ ప్యాకెట్లు భారీగా పట్టుబడ్డాయి. పట్టణానికి చెందిన చికోటి ఎంటర్‌ప్రైజెస్, బాలసుజాత జనరల్ స్టోర్స్, సాయి ట్రేడర్స్ తదితర దుకాణాల నుంచి సుమారు రూ.7లక్షల విలువైన సిగిరెట్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని దుకాణదారులపై కేసులు నమోదు చేశారు. అధికారులకు అందిన ప్రాథమిక సమాచారం మేరకు వరగానికి చెందిన సుధాకర్ అనే వ్యక్తి ఈ నకిలీ సిగిరెట్ ప్యాకెట్లు సరఫరా చేస్తున్నట్లు తెలిసింది. ఇప్పటి వరకు తమ దాడుల్లో అన్‌బ్రాండెడ్ విదేశీ సిగిరెట్ ప్యాకెట్లు మాత్రమే పట్టుబడేవని, తొలిసారి ప్రముఖ బ్రాండ్‌నేమ్‌తో నకిలీ సిగిరెట్లు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఈ రాకెట్ వెనుక ఉన్న సూత్రధారులను త్వరలోనే పట్టుకుంటామని ఎస్పీ తెలిపారు. దాడుల్లో విజిలెన్స్ సీఐ శ్రీహరిరావు, సిబ్బంది, ఐటీసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

చంద్రబాబు దుర్మార్గపు వ్యాఖ్యలు మానుకోవాలి

బాపట్ల: వలంటీర్ల వ్యవస్థపై తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు అనుచిత వ్యాఖ్యలు మానుకోకపోతే ప్రజలే సరైన బుద్ధి చెబుతారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత పేర్కొన్నారు. వలంటీర్ల వ్యవస్థపై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా చంద్రబాబునాయుడు దిష్టిబొమ్మను స్థానిక గడియార స్తంభం వద్ద శనివారం సాయంత్రం దహనం చేశారు. అనంతరం జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌ను కలిసి చంద్రబాబునాయుడుపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఈకార్యక్రమంలో మహిళా నాయకులు పాల్గొన్నారు.

పీజీ సెట్‌లో రాష్ట్ర స్థాయిలో 12వ ర్యాంకు



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

అద్దంకి: పీజీ సెట్‌లో కట్టా రామకోటేశ్వరరావు ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాల బీఎస్సీ విద్యార్థి జలగం సుమంత్‌కి వృక్షశాస్త్ర విభాగంలో రాష్ట్ర స్థాయిలో 12వ ర్యాంకు వచ్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ వీ మోహనరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థిని కళాశాల అధ్యాపకులు అభినందించారు.

ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్టు

రూ.3 లక్షల విలువైన 11 కిలోల గంజాయి పట్టివేత



పట్టుబడిన గంజాయిని పరిశీలిస్తున్న ఎస్పీ ఆరిఫ్ హఫీజ్

నగరంపాలెం: ఇద్దరు గంజాయి విక్రేతల్ని నల్లపాడు పోలీసులు అరెస్టు చేశారు. రూ.3 లక్షలు విలువైన 11 కిలోల గంజాయితో పాటు రెండు మొబైల్ ఫోన్లు సీజ్ చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో శనివారం జరిగిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాల్ని ఎస్పీ కె. ఆరిఫ్ హఫీజ్ వెల్లడించారు. ముందస్తు సమాచారంతో శనివారం జూట్ మిల్ శివాలయం రోడ్డులో కూలీలైన ఒడిస్సా రాష్ట్రం కంచూరు మండలం రంగుని సాహు గ్రామానికి చెందిన ప్రతాప్‌చంద్ర సాహు, సాకేతపురం రెండో వీధిలో ఉంటున్న పశ్చిమ బెంగాల్ రాష్ట్రం కుల్దియా మండల్ నైనన్ గ్రామానికి చెందిన జహీరుద్దీన్‌గాజీని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారించారు. ఇద్దరి వద్ద 11 కిలోల గంజాయి గుర్తించారు. వీరిలో ప్రతాప్‌చంద్రసాహు ఒడిస్సాలోని బరంపురం మల్కన్ గిరికి రైళ్లల్లో వెళ్లి అక్కడ గుర్తు తెలియని వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసేవాడు. చిన్న పొట్లాలుగా కట్టి, ఒక్కోదాన్ని రూ.350కు ఆటోడ్రైవర్లు, కూలీలు, విద్యార్థులకు విక్రయించేవాడు. ఈ క్రమంలో అతను జహీరుద్దీన్‌గాజీకి కూడా అమ్మడం మొదలెట్టాడు. దీంతో అతను కూడా గంజాయి విక్రయించి సొమ్ము చేసుకునేవాడు. చెడు వ్యసనాలకు బానిసై, తక్కువ వ్యవధిలో ఎక్కువ సంపాదించాలనే దురాశతో ఈ విక్రయాలు చేసేవారని ఎస్పీ తెలిపారు. ఒడిస్సాలో విక్రయించే వారిని కూడా అరెస్టు చేసే విషయంపై అక్కడి పోలీసులతో మాట్లాడినట్లు చెప్పారు. గంజాయిపై ఉక్కుపాదం మోపినట్లు ఎస్పీ పేర్కొన్నారు. కేసులో ప్రతిభ చూపిన దక్షిణ డీఎస్పీ ఎండీ.మహబూబ్ బాషా, నల్లపాడు పీఎస్ సీఐ బత్తుల శ్రీనివాసరావు, ఎస్ఐలు డి.అశోక్, ఎస్.జత్యనాయక్, కానిస్టేబుళ్లు షేక్ జాన్‌సైదా, డి.పోతురాజు, షేక్ మస్తాన్, ఆర్.కిరణ్‌లను ఎస్పీ అభినందించి, ప్రశంస పత్రాల్ని అందించారు. సమావేశంలో ఏఎస్పీ (క్రైం) ఎ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైభవంగా కార్మెల్ మాత ఉత్సవాలు



మెట్ల మార్గం ద్వారా కొండను ఎక్కుతున్న భక్తులు



భవనాన్ని ప్రారంభించి వాక్యోపదేశం చేస్తున్న గుంటూరు పీఠాధిపతి చిన్నాబత్తిని భాగ్యయ్య

ఫిరంగిపురం: స్థానిక కార్మెల్ కొండపై కార్మెల్ మాత ఉత్సవాలు రెండో రోజు శనివారం వైభవంగా జరిగాయి. కొండ పైనున్న సాగర్ మాత పుణ్యక్షేత్రం రెక్టార్ పి.జోసఫ్ బాలసాగర్ దివ్యపూజాబలి నిర్వహించారు. కోరినంతనే కోరికలు తీర్చే దివ్యమాత కార్మెల్‌మాతగా పేర్కొన్నారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు మాతను దర్శించుకొని కొవ్వొత్తులు వెలిగించి, మొక్కలు తీర్చుకున్నారు. కొండ దిగువ భాగంలోని మరియ మాత స్వరూపం వద్ద కొవ్వొత్తులు వెలిగించి, కొబ్బరికాయలు కొట్టారు. కొండ మెట్ల మార్గానికి ఇరువైపులా బొమ్మల దుకాణాలు, బాల ఏసు దేవాలయంలో రంగుల రాట్నాలు కనువిందు చేశాయి.

పోలీసు బందోబస్తు

భక్తులకు ఇబ్బంది తలెత్తకుండా తుళ్లూరు డీఎస్పీ పోతురాజు, మేడికొండూరు సీఐ వాసు ఆధ్వర్యంలో 150 సిబ్బంది బందోబస్తును పర్యవేక్షించారు. వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ లక్ష్మీ నారాయణరెడ్డి తెలిపారు.

సిస్టర్ కార్మెల్ మేరి వసతి భవనం ప్రారంభం

సిస్టర్ వొట్టి కార్మెల్ మౌంట్ మేరి మెమోరియల్ యాత్రికుల వసతి నిలయాన్ని గుంటూరు పీఠాధిపతులు చిన్నాబత్తిని భాగ్యయ్య ప్రారంభించి వాక్యోపదేశం చేశారు. కార్మెల్‌మాత కోరిన వరాలనిస్తుందని చెప్పారు. వసతి భవనం యాత్రికులకు ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. అనంతరం పలువురు విచారణ గురువులతో సమష్టి దివ్యపూజాబలి నిర్వహించారు. ముందుగా దివ్య సత్ప్రసాదాన్ని పీఠాధిపతులు ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఉంచారు. దానిలో కార్మెల్‌మాత స్వరూపాన్ని ఉంచి బాల ఏసు దేవాలయం వద్ద నుంచి గ్రామంలో ప్రదక్షిణ చేసి కొండమెట్ల వరకు తీసుకువచ్చారు. అక్కడ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బాల ఏసుదేవాలయ విచారణ గురువు పామిశెట్టి బాల స్వామితో పాటు పలు ప్రాంతాల నుంచి వచ్చిన విచారణ గురువులు ప్రార్థనల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో సహాయక గురువులు రాజవరపు అనిల్ కుమార్, గుడి పెద్దలు పాల్గొన్నారు.

భవిష్యత్ అంతా కృతిమ మేధదే!

కోల్‌కత్తా ఐఎస్ఐ ప్రొఫెసర్ ఉమపాద పాల్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఉమపాద పాల్

చేబ్రోలు: రాబోయే భవిష్యత్తు అంతా కృతిమ మేధ మీదే ఆధారపడి ఉంటుందని కోల్‌కత్తా ఐఎస్ఐ కంప్యూటర్ సైన్స్ అండ్ ప్యాట్రన్ రికగ్నిషన్ యూనిట్ ప్రొఫెసర్ ఉమపాద పాల్ తెలిపారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ''అప్లికేషన్స్ అండ్ అల్గారిథమ్స్ ఆఫ్ కంప్యూటర్ విజన్ అండ్ ప్యాట్రన్ రికగ్నిషన్'' అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం శనివారం ముగిసింది. ప్రొఫెసర్ ఉమపాద పాల్ మాట్లాడుతూ మెరుపు వేగంతో ముందుకొస్తున్న ఏఐ టెక్నాలజీని విద్యార్థులు అందిపుచ్చుకోవాలని సూచించారు. టాకింగ్ బోట్, చాట్‌బోట్, ఇమేజ్, ఫేస్ అండ్ ఎమోషన్ రికగ్నిషన్, ఏఐ ఆధారిత గేమ్స్‌కు సంబంధించిన కోడింగ్ నైపుణ్యాలు, వాటి తయారీపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. రాబోయే రోజుల్లో అన్ని రంగాల్లో రోబోటిక్స్ సేవలు అత్యంత కీలకంగా మారనున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో వీసీ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ ఎం.ఎస్. రఘునాథన్ పాల్గొన్నారు.

బీసీలకు అండగా నిలిచింది జగనన్నే

ఎమ్మెల్సీ, రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షులు జంగా కృష్ణమూర్తి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

క్రోసూరు: రాష్ట్రంలో బీసీ కులాలకు గుర్తింపు, ప్రాధాన్యత ఇచ్చి అండగా నిలిచింది ఒక్క సీఎం జగన్ మోహన్‌రెడ్డి మాత్రమేనని ఎమ్మెల్సీ, రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు జంగా కృష్ణమూర్తి అన్నారు. క్రోసూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం జరిగిన వైఎస్సార్ సీపీ బీసీ ఆత్మీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అధ్యక్షత వహించారు. జంగా మాట్లాడుతూ వెనుకబడిన బీసీ కులాల్ని ఎన్టీఆర్ రాకముందు ఓటు బ్యాంకుగానే రాజకీయ పార్టీలు వాడుకున్నాయన్నారు. ఎన్టీఆర్ వచ్చిన తరువాత బీసీలకు ఆయన మద్దతు ఇచ్చారన్నారు. మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి మాత్రమే బీసీలకు అండగా నిలిచి వారి అభ్యున్నతికి పాటు పడ్డారని తెలిపారు. ఈ సందర్భంగా పెదకూరపాడు నియోజకవర్గంలో ఐదు మండలాల బీసీ సెల్ అధ్యక్షుల పేర్లను ఎమ్మెల్యే శంకరరావు ప్రకటించారు. వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సాతర్ల శ్రీనివాసరావు, పెదకూరపాడు మండల వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు మస్తాన్‌రావు, అమరావతి మండల బీసీసెల్ అధ్యక్షుడు మల్లిబోయిన శ్రీనివాసరావు, బెల్లంకొండ బీసీ సెల్ అధ్యక్షుడు గమిడి కోటి నాగయ్య, అచ్చంపేట బీసీ సెల్ అధ్యక్షుడు రామచంద్రరావు, క్రోసూరు బీసీ సెల్ అధ్యక్షుడు పోతురాజు గురుస్వామిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ముందుగా ఎంపికైన కమిటీ ప్రతినిధులు జంగా కృష్ణమూర్తిని, ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఐదు మండల బీసీ నాయకులు, వైఎస్సార్ సీపీ నాయకులు ఎంపీపీ వి.కోటయ్య, జెడ్పీటీసీ షేక్ జమీలా గఫూర్, షేక్ మస్తాన్, గంజినబోయిన శ్రీనివాసరావు, డాక్టర్ షరీఫ్, తిప్పిరెడ్డి, అప్పిరెడ్డి పాల్గొన్నారు.

4 నుంచి బ్యాడ్మింటన్ పోటీలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ సావిత్రి తదితరులు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): గుజ్జల సుధాకరరెడ్డి మెమోరియల్ ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రస్థాయి ఓపెన్ బాలబాలికల అండర్- 13, 15, 17 బ్యాడ్మింటన్ పోటీల్ని వచ్చే నెల 4 నుంచి 6 వరకు నిర్వహిస్తామని సుధాకరరెడ్డి బ్యాడ్మింటన్ అకాడమీ సీఈఓ డాక్టర్ కె.సావిత్రి తెలిపారు. స్థానిక జేకేసీ కాలేజీ రోడ్డులోని జీటీ స్పోర్ట్స్ హాలులో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రెండు రాష్ట్రాల నుంచి పలువురు క్రీడాకారులు పాల్గొంటారని చెప్పారు. అనంతరం క్రీడల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ పి.రామచంద్రరాజు, విజయలక్ష్మి, పి.శివనాగరాజు, కె.ప్రవీణ్, విల్సన్, వి.రమాకాంత్ పాల్గొన్నారు.